సాక్షి
బాపట్ల
బుధవారం । 20 । ఆగస్టు । 2025



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నాదెండ్ల: నేర ప్రవృత్తిని విడనాడి, బాధ్యతగా ఉంటూ పనిచేసుకోవాలని నాదెండ్ల ఎస్‌ఐ పుల్లారావు సూచించారు. మంగళవారం రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు.



పసుపు కొమ్ములతో మహాభిషేకం

నాగాయలంక: శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలోని శివలింగానికి మంగళవారం 108 కేజీల పసుపు కొమ్ములతో మహాభిషేకం జరిపారు.

ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



పిడుగురాళ్ల: భవానీనగర్‌లో వేంచేసియున్న శ్రీ కనక దుర్గమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

న్యూస్‌రీల్

మట్టి అక్రమ తవ్వకాలపై మైనింగ్ శాఖ విచారణ



నగరం: రేపల్లె నియోజకవర్గం పరిధిలోని నగరం, చెరుకుపల్లి మండలాలలో కూటమి నాయకులు జరిపిన మట్టి అక్రమ తవ్వకాలపై మైనింగ్ శాఖ అధికారులు మంగళవారం విచారణ జరిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నగరం, చెరుకుపల్లి మండలాల్లోని పలు గ్రామాలలో కూటమి నాయకులు అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపారు. లక్షలాది రూపాయలు దోచుకున్నారు. పచ్చని పంట పొలాలను చెరువులుగా మార్చివేశారు. కూటమి నాయకుల అక్రమాలపై ప్రజలు, ప్రజాసంఘాలతోపాటు జై భీమ్‌రావ్ భారత్ పార్టీ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో మైనింగ్ శాఖ అధికారులు మంగళవారం నగరం మండలం పెద మట్లపూడిలో పర్యటించి మట్టి తవ్విన ప్రాంతాలను పరిశీలించారు. కొలతలు వేశారు. తవ్వకాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ ఆర్‌ఐ రాజేంద్రప్రసాద్, సర్వేయర్ నాగలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్

రేపల్లె: డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు బుధవారం నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.సి. రవిచంద్రకుమార్ చెప్పారు. స్థానిక కళాశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో సైన్స్ విభాగంలో బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (ఫిజిక్స్), బీఎస్సీ (జువాలజీ) కోర్సులు, బీఏ (హిస్టరీ), బీఏ (ఎకనామిక్స్), బీకాం (జనరల్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులందరూ ఆన్‌లైన్‌లో అడ్మిషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసుకొని, అడ్మిషన్ పొందాలని కోరారు.

24న టీటీసీ పరీక్ష నిర్వహణ

బాపట్ల: ఈ ఏడాది ఆగస్టులో జరిగే టీటీసీ లోయర్ గ్రేడ్–థియరీ రెగ్యులర్, ప్రైవేటు అభ్యర్థులకు ఈనెల 24వ తేదీన ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ పురుషోత్తం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఉంటాయని తెలిపారు. హాల్‌టికెట్లు అధికారిక వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేయించుకోవాలని సూచించారు.

జీజీహెచ్‌లో ఫిర్యాదుల బాక్సు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యుడు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ ఫిర్యాదుల బాక్స్‌లో పది ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిపై హెచ్‌డీఎస్ కమిటీ చర్చించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

108 కిలోల గంధంతో అభిషేకార్చన



నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ మందిరం కోటి కుంకుమార్చనలో భాగంగా శ్రావణ మంగళవారం స్వామి, అమ్మవారికి విశేష పూజలు, శ్రీచక్ర మహామేరుకు విశేష అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం 108 కిలోల గంధంతో విశేష అభిషేకార్చన భక్తిశ్రద్ధలతో చేపట్టారు. హారతులు, మంత్రపుష్పం అనంతరం కుంకుమార్చనకు హాజరైన వారు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాలు నిర్వాహకులు అందించారు. నక్షత్ర హారతి, మంత్రపుష్పం చేపట్టగా, నిర్వాహకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాగుదామా.. ఆగుదామా!

- సాగుపై అన్నదాతల్లో అయోమయం
- ఘోరంగా పతనమైన ధాన్యం ధరలు
- నష్టపోయిన రైతులు
- కౌలుకు సాగు చేసేందుకు ముందుకు రాని వైనం
- పతనమైన కౌలు ధరలు



కారంచేడు–చీరాల రోడ్డులో బీడు భూములుగానే ఉన్న వరిచేలు

కారంచేడు: కూటమి పాలనలో అన్నదాతల పరిస్థితి ఘోరంగా తయారైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించడంలో దారుణంగా విఫలమైంది. దీంతో అన్నదాతలు మళ్లీ పంటలు సాగు చేసేందుకు జంకుతున్నారు. ఈ ఏడాది సాగు భూములను కౌలుకు అడిగే వారే కరువయ్యారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంతంలోని కర్షకుల దీనావస్థపై కథనం..

పతనమైన కౌలు, ధాన్యం ధరలు:

బాపట్ల జిల్లాలోనే అత్యధిక మాగాణి సాగు ప్రాంతంగా ఉన్న కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు చేస్తారు. చీరాల, కారంచేడు, వేటపాలెం, చినగంజాం, నాగులుప్పలపాడు మండలాల్లోని గ్రామాల్లో రైతులు 2270, 2595, 892 రకం విత్తనాలను ఎక్కువగా సాగు చేస్తారు. ఈ రకం విత్తనాలు ఎకరానికి వాతావరణాన్ని బట్టి 30 నుంచి 50 బస్తాల వరకు దిగుబడులు వస్తాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో బస్తా (75 కేజీలు) ధాన్యం ధర రూ.2400 నుంచి రూ.2600 వరకు అమ్మకాలు జరిగాయి. కూటమి ప్రభుత్వంలో బస్తా ధర రూ.1600– రూ.1700 మాత్రమే ఉంది. అవి కూడా అడిగే వారు లేరు, కొనే వారు అంతకన్నా లేరని అన్నదాతలు వాపోతున్నారు. కౌలు ధరలు కూడా వైఎస్సార్ సీపీ పాలనలో ఎకరం మాగాణి భూములకు 17–18 బస్తాలు ఉంటే, నేడు 11–13 బస్తాల కౌలు మాత్రమే ఉంది. అది కూడా అడిగే వారే కరువయ్యారని రైతులు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో సాగు ఖర్చు ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.22 వేలు అయితే నేడు రూ.25 వేల నుంచి రూ.27 వేల వరకు అవుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దుక్కులు దున్ని వదిలేసిన భూమి

కూటమి ప్రభుత్వంలో కర్షకులకు కన్నీళ్లే..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్నదాతలు ఎంతో సంతోషంగా ఉన్నారు. సాగుకు ముందే పెట్టుబడి నిధులతో సాగును ప్రారంభించిన అన్నదాతలకు సమయానుకూలంగా రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించేవారు. ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు నష్టపోయినా వెంటనే ఇన్స్యూరెన్స్, పంట నష్ట పరిహారాలు అందించారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఏ ఒక్క ఏడాదిలోను రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు లేవని రోడ్డెక్కలేదు. కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభించిన ఏడాదిలోనే అన్నదాతలు పంటలకు గిట్టుబాటు ధరలు లేక, కొనే నాథుడు లేక కన్నీటి పర్యంతమవుతున్నారు.

గిట్టుబాటు ధరలు లేవు



ఈ ఏడాది సాగు చేసి ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధరలు లేవు. నేను మిరప, వరి, శనగ పంటలను సాగు చేసేవాడిని. గతేడాది గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఈ ఏడాది మిరప సాగుకు స్వస్తి చెప్పాను. వరి, శనగ సాగు కూడా చాలా వరకు తగ్గించాను. పెట్టుబడి పెట్టడానికి కూడా ధైర్యం సరిపోవడం లేదు. సాగు చేయడానికి కౌలు రైతులు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు.

– నక్కా రామకృష్ణ, కౌలురైతు, కారంచేడు

గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి



గతేడాది పండించిన పంటల్లో 80 శాతం రైతుల ఇంటి ముంగిట మూలుగుతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మళ్లీ పంటలు సాగు చేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ముందుకు వచ్చిన అన్నదాతల వద్ద పేరుకుపోయిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– యార్లగడ్డ శ్రీకాంత్, రైతు, కారంచేడు

పెరుగుతున్న వరద

భట్టిప్రోలు: ప్రకాశం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్న వరద నీటి కారణంగా మండలంలోని కృష్ణానదీ పరివాహక లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వాణిజ్య పంటలు నీట మునిగే ప్రమాదం పొంచి ఉన్నందున రైతులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే మండలంలోని పెదపులివర్రు–పెసర్లంక, ఓలేరు–పెసర్లంక, కోళ్లపాలెం–పెసర్లంక చప్టాలపై నీరు ప్రవహిస్తుండడంతో ఆయా మార్గాల్లో తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి. లంక గ్రామాల వాసులు వెల్లటూరు చినరేవు హైలెవల్ వంతెన మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నారు.

రేవులోకి వెళ్ల వద్దు

కృష్ణానదికి వరద పెరుగుతుండడంతో రేవులోకి వెళ్లవద్దని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు లంక గ్రామాల ప్రజలకు సూచించారు. నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా రెవెన్యూ శాఖతోపాటు పోలీస్, పంచాయతీరాజ్, అగ్నిమాపక, ఆర్‌సీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల రెవెన్యూ అధికారులకు తెలియజేస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కృష్ణానది సమీపంలోని ఓలేరు పల్లెపాలెం, పెదలంక, పెసర్లంక, చింతమోటు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయా ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బోట్లు, ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.



భట్టిప్రోలు మండలం కాకులదొండ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ పుల్లారెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి

చీరాల అర్బన్: ప్రతి వినియోగదారుడికి నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పాపరాజు తోటలోని బాపనమ్మ కల్యాణ మండపంలో జిల్లా విద్యుత్‌శాఖ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ, పల్లె ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రజాభిప్రాయసేకరణలో మంచి ఫలితం సాధించాలని సూచించారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనులు సకాలంలో పూర్తిచేసి వినియోగదారులకు అందించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అలానే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరితగతిన వినియోగదారులకు అందించాలని, రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల మీద వాటి పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎస్‌ఈ ఆంజనేయులు, డైరెక్టర్ టెక్నికల్ మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్సు ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లాలోని ఈఈలు, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలాజీకి జాతీయ ఫొటోగ్రాఫర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బాలాజీ



అవార్డు అందించిన బాలాజీ తీసిన చిత్రం

వేటపాలెం: వేటపాలేనికి చెందిన గాత్రం బాలాజీ మోహన్‌కృష్ణ జాతీయ స్థాయి ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నాడు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో జరిగిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం అవార్డు ప్రదానోత్సవంలో రాష్ట్ర టూరిజం, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ చేతుల మీదుగా ఫొటోగ్రాఫర్ బాలాజీ సోమవారం అవార్డు అందుకున్నారు. 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రఫీ అకాడీ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, రాష్ట్ర సాంస్కృతిక సృజనాత్మక సమితి వారి సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహించారు. ఫొటో ట్రావెల్ విభాగంలో బాలాజీ మోహనకృష్ణకి మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు ప్రైజ్‌మనీ అవార్డు లభించింది. గతంలో కూడా బాలాజీ తీసిన ఉత్తమ ఫొటోగ్రఫీలో అనేక ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

అవగాహన ఫ్లెక్సీ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ప్రచార ఫ్లెక్సీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీని ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ శివశంకర్ బాబు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ, డీపీహెచ్‌ఎన్ డాక్టర్ ప్రియాంక, స్టాటిస్టికల్ అధికారిణి పద్మజ, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజు నాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వరద ఉధృతం.. భయం భయం



రామాపురం మత్స్యకారుల కాలనీని ఆనుకుని ప్రవహిస్తున్న కృష్ణానది

- దాచేపల్లి మండలం రామపురం మత్స్యకారుల కాలనీకి చేరువలోకి వరద
- భయం గుప్పిట్లో గ్రామస్తులు

దాచేపల్లి: కృష్ణా నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మత్స్యకారుల కాలనీ ప్రమాదం అంచున ఉంది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామపురం గ్రామంలోని మత్స్యకారుల కాలనీ అనుకొని కృష్ణానదిలో వరద నీరు మంగళవారం ఉధృతంగా ప్రవహిస్తుంది. కాలనీలోని నివాస గృహాలకు కూతవేటు దూరంలో వరద నీరు ప్రవహిస్తుండంతో మత్స్యకారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. కాలనీలో 50 పైగా మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు నుంచి వరద నీరు దిగువకు విడుదల చేయడం వలన నది ఉధృతంగా ప్రవహిస్తుంది. నీటి విడుదల పెరిగితే మత్స్యకారుల కాలనీలోకి వరద నీరు చేరే అవకాశం ఉంది. నదిలో నీటి ప్రవాహం మరింత పెరిగితే మత్స్యకారులను అక్కడి నుంచి ఖాళీ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

‘కృష్ణా’లో పెరుగుతున్న వరద ఉధ్ధృతి

మొదటి ప్రమాద హెచ్చరికతో అప్రమత్తంగా ఉండాలని సూచన

కొల్లిపర: ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నాగార్జున సాగర్, ఇతర జలాశయాలు నిండు కుండల్లా మారుతున్నాయి. దీతో కృష్ణా నదికి సుమారుగా 5 లక్షల క్యూసెక్కులు వరద నీరు రాగా, మంగళవారం అధికారులు ఈ మేరకు దిగువకు వదిలారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఎస్సై కోటేశ్వరరావులు తెలిపారు. మండలంలోని లంక గ్రామంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న 24 గంటల్లో కృష్ణా నదిలో వరద ఉధ్ధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. లంక గ్రామంలోని వారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. నదులు, ఇతర జల వనరుల వద్దకు ప్రజలు వెళ్లరాదని హెచ్చరించారు. అత్యవసరమైతే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పడవ వేయాలని నడిపే వ్యక్తులకు ఆదేశించారు. పాడి రైతులు పశువులను నదిలో దించడానికి ప్రయత్నించరాదని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



అన్నవరపు లంకలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సిద్ధార్థ, ఎస్సై కోటేశ్వరరావు

మంగళగిరిలో ఇన్నోవేషన్ హబ్

నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



మంగళగిరి టౌన్: యువతలోని వినూత్న ఆలోచనలను మెరుగుపట్టి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను మంగళగిరిలో ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి నగర పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న మయూరి టెక్ పార్క్‌లో ఈ హబ్ ఏర్పాటైంది. దీనిని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. యువతకు ఇక్కడ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను సీఎం పరిశీలిస్తారని ఇన్నోవేషన్ సొసైటీ సీఈఓ సూర్యతేజ తెలిపారు.

శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



తాడికొండ: అమరావతి రాజధానిలోని వేంకటపాలెంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం యాగశాలలో పంచగవ్యారాధన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు విశేష అభిషేకం నిర్వహించారు. సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ఠ, అధివాసం, సర్వ దైవత్య హోమం చేపట్టారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, సందీప్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోడలిని చంపిన మామకు జీవిత ఖైదు

నరసరావుపేట టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో కోడల్ని గొడ్డలితో నరికి హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామానికి చెందిన ధారా యాకోబుకు జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్.సత్య శ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి... మృతురాలు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం గ్రంథసిరి గ్రామానికి చెందిన చిలక సుందరరావు కుమార్తె దారా కోటేశ్వరమ్మతో నిందితుడు యాకోబు కుమారుడు శ్యాంబాబుకు ఘటనకు 12 సంవత్సరాల ముందు వివాహమైంది. వేమవరం గ్రామంలో నివసిస్తున్న కోటేశ్వరమ్మ బంధువులతో యాకోబుకు వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోటేశ్వరమ్మను ఆమె బంధువులతో మాట్లాడొద్దని యాకోబు చెప్పాడు. అయినప్పటికీ కోటేశ్వరమ్మ వాళ్లతో మాట్లాడుతుంది. దీనిని మనసులో పెట్టుకుని నిందితుడు యాకోబు 2019, నవంబర్ 11వ తేదీన కోటేశ్వరమ్మను గొడ్డలితో నరికి హతమార్చాడు. ఈ మేరకు బంధువుల ద్వారా సమాచారం అందుకున్న మృతురాలి తండ్రి చిలక సుందరరావు ఫిరంగిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిండితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ గుండాల సురేష్ బాబు నిర్వహించారు.

రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్ కట్

లబోదిబోమంటున్న దివ్యాంగుడు



పింఛన్ కోల్పోయిన లుక్కా నాగరాజు

నగరం: కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్లలో కోత పెడుతోంది. 90 శాతం పైగా అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు సైతం మొండిచెయ్యి చూపుతున్నారు. నగరం మండలం పెద్ద మట్లపూడి గ్రామానికి చెందిన లుక్కా నాగరాజుకు 90 శాతం అంగవైకల్యం ఉండడంతో 2011వ సంవత్సరం నుంచి పింఛన్ పొందుతున్నాడు. వికలాంగ పింఛన్ పొందుతున్న వారు మరోమారు వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రీ వెరిఫికేషన్‌కు వెళ్లిన నాగరాజుకు నిరాశ ఎదురైంది. పింఛన్ పొందేందుకు సరిపడినంత అంగవైకల్యం లేదని సచివాలయానికి సర్టిఫికెట్లు వచ్చాయి. నాగరాజు పింఛన్ నగదుపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఇప్పుడు పింఛన్ నిలిపివేసినట్లు అధికారులు చెప్పడంతో తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.



గతంలో పింఛన్ శాతాన్ని నిర్ధారించిన వికలాంగ సర్టిఫికెట్

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,600** గరిష్ఠం : రూ. **4,800**

మోడల్ ధర రూ. **4,200**

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	54,935
అమ్మకాలు	53,278
నిల్వ	8,716

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,300
341	10,000-14,700

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,400
నంబరు-5	10,000-13,500
341	11,000-14,800
4884	10,000-12,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,500
బాడిగ-355	10,000 - 13,200
దేవనూరు డీలక్స్	10,000 - 13,300
ఆర్మూర్	9,800 - 11,200
తాలుకాయలు	6,000 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-14,200
బాడిగ - 355	10,000-13,000
దేవనూరు డీలక్స్	10,500-13,500
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **224**

కొమ్ములు : 150 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,811	10,500	10,300

కాయలు : 74 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,811	10,400	10,200

మొత్తం అమ్మకాలు : **168.00** క్వింటాళ్లు

-దుగ్గిరాల

రైతుల తరఫున పోరాడితే కేసులు...
ఎమ్మెల్యే ధూళిపాళ్లకు సూట్‌కేసులు

పొన్నూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపణ



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): రైతుల పక్షాన పోరాడే వారిపై పొన్నూరు టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కేసులు పెడుతున్నారని, ఆయనకు మాత్రం సూట్‌కేసులు వెళ్తున్నాయని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. కూటమి ఏడాదిన్నర కాలం పాలనలో రైతుల సమస్యలను నరేంద్ర పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. గుంటూరులోని తన కార్యాలయంలో అంబటి మురళీకృష్ణ మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంటూరు చానల్‌కు గండ్లు పడ్డాయన్నారు. ఫలితంగా పెదకాకానిలో 11 వేల ఎకరాలు, చేబ్రోలులో 5 వేల ఎకరాలు, పొన్నూరు రూరల్‌లో 15 వేల ఎకరాలు నీట మునిగాయని పేర్కొన్నారు. కొండవీటి వాగు ప్రవాహం గుంటూరు చానల్‌లోకి చేరడంతో పొలాలన్నీ దెబ్బతిన్నాయని ఆరోపించారు. ఇంతటి భారీ నష్టం సంభవిస్తే గుంటూరు చానల్ లాకులు మూసినట్టు ప్రభుత్వం చెప్పడం అబద్ధమేనన్నారు. అయితే ఆ నీరంతా ఆకాశం నుంచి వచ్చిందా, భూమి లోపలి నుంచి పైకి వచ్చిందా అనేది కూడా ప్రభుత్వమే చెప్పాలన్నారు. రైతులు మాత్రం కొండవీటి వాగు నుంచే భారీగా నీరు వచ్చి నష్టం చేసిందని చెప్పడాన్ని ఇక్కడ గమనించాలన్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవాలి

గత ఏడాది పంటలు మునిగిపోయిన నేపథ్యంలో రూ.16 కోట్లు నష్టపరిహారంగా ఇచ్చామని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చెబుతున్నారని, అయితే ఈ ఏడాది నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వనవసరం లేదా అన్ని అంబటి మురళీకృష్ణ ప్రశ్నించారు. అంతేగాక గతంలోనే నష్టపరిహారం చెల్లించామని, కాల్వలు కూడా బాగు చేయించామని ఎమ్మెల్యే నరేంద్ర చెప్పిన మాటల్లో వాస్తవం లేదన్నారు. అదే నిజమైతే ఈ వర్షాలకు గండ్లు ఎలా పడ్డాయో చెప్పాలన్నారు. ఈ ఏడాది సార్వా సాగుకు రైతులు ఇప్పటికే ఎకరాకు రెండు సార్లు రూ. 20 వేలు ఖర్చు చేశారన్నారు. మూడోసారి నారుమడి వేసే పరిస్థితి కూడా లేదన్నారు. తక్షణమే ఎకరాకు తాత్కాలిక పరిహారంగా రూ.10 వేల నగదు, ఉచితంగా ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలన్నారు. ఇక అన్నదాతలు ఇంతటి దయనీయ స్థితిలో ఉంటే రెండు నెలలుగా ఎమ్మెల్యే నరేంద్ర నియోజకవర్గంలోనే కనిపించకపోవడం సిగ్గుచేటన్నారు. పంటల నష్టపోయినట్టు రైతులు ఎమ్మెల్యేకు ఫోన్ చేసి చెబితే... పంటలు పోతే పోయాయని, రియల్ ఎస్టేట్‌కు ఇవ్వాలని చెప్పడం ఆయన దుర్బుద్ధిని తెలియజేస్తోందన్నారు. రైతుల పక్షాన పోరాడుతుంటే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. చేబ్రోలు, కొమ్మమూరు బ్రిడ్జికి సంబంధించి గుంతలు తీసి వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద నీరు భారీగా వచ్చి నడిరోడ్డుపై గుండాలు ఏర్పడ్డాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదని అంబటి మురళీకృష్ణ సూటిగా ప్రశ్నించారు.

బైకును ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి



గోలమూడి కుమార్ మృతదేహం

మేదరమెట్ల: వెనుక నుంచి వచ్చిన లారీ బైకును ఢీకొని ఒక వ్యక్తి మృతిచెందిన ఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల ఫైలాన్ సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు జే.పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన గోలమూడి కుమార్ (37) భార్య వెన్నెలతో కలసి ఒంగోలులో ఉంటున్న కుమారుని కలసి మోటారు బైకుపై తిరిగి స్వగ్రామం వస్తున్నారు. బైకు ఫైలాన్ సమీపానికి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ మోటారు బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో కుమార్‌ను లారీ కొద్ది దూరం లాక్కొనిపోయింది. దీంతో కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్ భార్య వెన్నెల రోడ్డు పక్కన పడిపోయింది. ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదు. తన కళ్ల ముందే భర్త విగతజీవిగా మారడంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల ఎస్సై మహ్మద్ రఫీ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో గేదెల దొంగ

యద్దనపూడి: గేదెలను అపహరిస్తున్న ఓ వ్యక్తిని అనంతవరం గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సంవత్సర కాలంగా మండలంలో గేదెల దొంగతనాలు ఎక్కువయ్యాయి. రాత్రి సమయాల్లో ఇళ్ల ముందు కట్టేసిన గేదెలను, పగలు పొలాలకు వెళ్లిన గేదెలను కొంతమంది దొంగిలించి వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇలా యద్దనపూడి, పూనూరు, సూరవరపుపల్లి, చిమటవారిపాలెం, పోలూరు, జాగర్లమూడి గ్రామాల్లో సుమారు 30 గేదెల వరకు మాయమయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి అనంతవరం మీదుగా సూరవరపుపల్లి వైపు పశువులను తోలుకువెళుతుండటంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు.. పశువులను ఈ సమయంలో ఎక్కడికి తోలుకువెళ్తున్నావని ప్రశ్నించారు. అయితే అతను పొంతన లేని సమాధానం చెప్పటంతో గ్రామస్తులు అవి అపహరించిన గేదెలుగా గుర్తించి యద్దనపూడి పోలీసులకు సమాచారం అందించారు. పర్చూరు మండలం కొల్లావారిపాలెం గ్రామానికి చెందిన గొట్టిపాటి మారుతికి చెందిన పశువులుగా గుర్తించి వాటిని పశుపోషకుడికి అందజేశారు. కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన నిందితుడు జూపూడి ప్రతాప్ పర్చూరు పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సంప్రదాయబద్ధంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ

జిల్లా గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: సనాతన హిందూ ధర్మం ప్రకారం సంప్రదాయబద్ధంగా, పర్యావరణ హితంగా మండపాలతో గణేష్ మహోత్సవాలను శోభాయమానంగా నిర్వహించాలని గుంటూరు జిల్లా గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రరాజు అన్నారు. మంగళవారం కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రామచంద్రరాజు మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మిక భావన వెల్లివిరిసి మన సంస్కృతీసంప్రదాయాల ప్రకారం గణేష్ ఉత్సవాల నిర్వహణ కోసం సమితి పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వ అనుమతితో ఎవరికీ ఇబ్బంది లేని విధంగా మండపాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి లక్ష్మీపతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు, అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుంటూరు జిల్లాలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయదలచిన భక్తులు సమితి ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశ్వరరావును సంప్రదించి దరఖాస్తు అందిస్తే ప్రభుత్వం నుంచి అనుమతులు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకుంటారని చెప్పారు. వివరాలకు 81064 33594 ఫోను నంబర్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు మదన్ పురోహిత్, ఉపాధ్యక్షుడు హరిహరరాయలు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సభ్యులు కంచర్ల ఆంజనేయులు, రవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుళ్లూరులో 16.6 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా తుళ్ళూరు మండలంలో 16.6 మిల్లీ మీటర్లు వర్షపాతం పడింది. అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.2 మి.మీ. కురిసింది. సగటు 4 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు... పెదకాకాని మండలంలో 12.4 మి.మీ., తాడేపల్లి 11.2, పెదనందిపాడు 6.2, మంగళగిరి 5.6, దుగ్గిరాల 3.8, కొల్లిపర 3.6, కాకుమాను 3, తాడికొండ 2.6, పొన్నూరు 2.2, గుంటూరు పశ్చిమ 2, మేడికొండూరు 1.6, ఫిరంగిపురం మండలంలో 1.4 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది.

బంగారు గొలుసు అప్పగింత



బంగారు గొలుసు అందజేస్తున్న డీఎం

అద్దంకి రూరల్: బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న బంగారు చైన్‌ను డిపో మేనేజర్ ఆ ప్రయాణికుడికి అందజేశారు. డీఎం తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు సమతా నగర్‌కు చెందిన ప్రయాణికుడు సుబ్రహ్మణ్యం మంగళవారం అద్దంకి డిపోకు చెందిన బస్సులో అద్దంకి నుంచి ఒంగోలు బయలుదేరాడు. బస్సులో తన బంగారు గొలుసు పోగొట్టుకున్నాడు. ఈ విషయం గమనించి అద్దంకి డిపో మేనేజర్ రామ్మోహనరావుకు తెలియజేశారు. డీఎం వెంటనే సంబంధిత బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేశారు. డ్రైవర్ బస్సును పరిశీలించగా 2 సవర్ల బంగారు చైన్ కనబడటంతో తీసుకువచ్చి డీఎంకు అందజేశారు.

వైఎస్సార్ సీపీ నేతలపై విమర్శలు తగదు

- టీడీపీ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి
- 'రాజధాని ముంపు'పై వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: కొండవీడు వాగు వరద మళ్లింపుతో పాటు కృష్ణా నది నుంచి నీరు వెనక్కి తన్నడం వలనే మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని తదితర మండలాలు మునిగాయని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. మండలంలోని నీరుకొండ, కురగల్లుల మధ్య వాగు ముంపు ప్రాంతాలను పరిశీలించిన వైఎస్సార్ సీపీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతూ తమ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి వాగు వరద మళ్లిపు, ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా 70 వేల ఎకరాలు పంటలు మునిగాయని చెప్పారన్నారు. రైతులను ఆదుకోవాలని కోరారన్నారు. టీడీపీ నాయకులు దీనికి సమాధానం చెప్పకుండా అడ్డగోలుగా విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. వర్షం తగ్గినా మంగళవారం వరకు ఇక్కడ కనుచూపు మేర నీరు నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగాల నాగిరెడ్డి, మల్లవరపు సుధారాణి, సయ్యద్ గౌస్ మొహిద్దీన్, ఆర్థల చిన్నారి, కట్టిపోగు భూషణం, షేక్ గౌస్ పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం



లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జియావుద్దీన్

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సైనికోద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు న్యాయ సహాయం అవసరమైతే ఈ క్లినిక్‌ను సందర్శించాలని తెలిపారు. దీనికి ప్యానెల్ అడ్వకేట్‌గా పి.రాజేష్ లింగం, పారా లీగల్ వలంటీర్‌గా పి.శిరీషను నియమించారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల, మాజీ సైనిక ఉద్యోగులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుమార్తెపై లైంగికదాడి యత్నం.. వ్యక్తిపై పోక్సో కేసు

తాడికొండ: కుమార్తెపైనే అత్యాచారయత్నానికి ఒడిగట్టిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసిన ఘటన తాడికొండ మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... సదరు గ్రామానికి చెందిన వ్యక్తికి ఓ మహిళతో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మొదటి నుంచి ఆమెను హింసించేవాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆ మత్తులో పెద్ద కుమార్తె (16)తో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో కుటుంబసభ్యుల సహకారంతో ఆమెతోపాటు మరో ఇద్దరు కుమార్తెలను కూడా తల్లి హాస్టల్‌లో చేర్పించింది. జూలై 27వ తేదీన హాస్టల్ నుంచి పెద్ద కుమార్తెను బలవంతంగా ఇంటికి తీసుకొచ్చిన అతడు 30వ తేదీన రాత్రి సమయంలో ఆమెపై అఘాయిత్యానికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి కాపాడారు. ఈ నెల 11న మరదలి వద్ద ఉంటున్న కుమార్తెను నిందితుడితోపాటు అతని సోదరుడు బలవంతంగా తీసుకెళ్లేందుకు యత్నించాడు. ఇంతలో స్థానికులు రావడంతో వారు పారిపోయారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు తండ్రితోపాటు కుటుంబ సభ్యులపై ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

త్వరలో అనుబంధ విభాగాల నియామకాలు



అంబటి రాంబాబుతో మస్తాన్ వలి

నెహ్రూనగర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా, నియోజకవర్గ, డివిజన్ అనుబంధ విభాగాల నియామకాలను త్వరితగతిన పూర్తి చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు, తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్‌లు తెలిపారు. గుంటూరు నగరంలోని అంబటి రాంబాబును, తెనాలిలో అన్నాబత్తుని శివకుమార్‌ను వారి కార్యాలయాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు, పల్నాడు జిల్లాల అనుబంధ విభాగాల ఇన్‌చార్జి షేక్ మస్తాన్‌వలి మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు జిల్లాతోపాటు, గుంటూరు పశ్చిమ, తెనాలి నియోజకవర్గాల అనుబంధ విభాగాల కమిటీల గురించి ప్రస్తావించారు. త్వరితగతిన కమిటీలు పూర్తి చేసేలా దృష్టి సారించాలని కోరారు. వారు మాట్లాడుతూ అనుబంధ విభాగాల కమిటీలు ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. అన్ని వర్గాల వారికి ప్రాధాన్యం కల్పించేలా పదవులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటుతో పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు.

గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం వేలాకణికి ప్రత్యేక రైలును చర్లపల్లి-తిరువూరు-చర్లపల్లి మీదుగా నడపనున్నారు. ఈ మేరకు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. నంబర్ 07091 చర్లపల్లి - తిరువూరు రైలు ఈ నెల 27న, సెప్టెంబర్ 8వ తేదీన చర్లపల్లి నుంచి ఉదయం 8.10 గంటలకు బయలుదేరనుందని పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు తిరువూరు చేరుకుంటుందని చెప్పారు. నంబర్ 07902 తిరువూరు - చర్లపల్లి రైలు ఈ నెల 28న, సెప్టెంబర్ 9న తిరువూరులో రాత్రి 10.35 గంటలకు బయలుదేరనుందని వివరించారు. మరుసటి రోజు అర్ధరాత్రి చర్లపల్లికి 01.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, ఆటో డ్రైవర్లు

లక్ష్మీపురం: ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. గుంటూరు హిందూ కళాశాల సెంటర్‌లో మంగళవారం ఫెడరేషన్ తరఫున ఆటో కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్.మస్తాన్‌వలి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలన్నారు. వాహన మిత్ర కింద రూ.25 వేల సాయం అందివ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు, తక్కువ వడ్డీకి రుణాలు అందించే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలని కోరారు. లేకుంటే ఈ నెల 24వ తేదీన ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలో చర్చించి ఆందోళన చేపడతామన్నారు. గుంటూరు జిల్లా ఆటోడ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు బి. లక్ష్మణరావు, గుంటూరు నగర ఆటోడ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి జి.శంకర్ రావు, కె.కోటేశ్వరరావు, షేక్ ఖాసిం, అశోక్, షేక్ జానీ, వెంకటయ్య, సాంబయ్య, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో ఆర్జిత సేవలపై మీమాంస

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించే దసరా ఉత్సవాల్లో భక్తులకు మరిన్ని సదుపాయాలను కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం, ఉన్న వసతులు, సేవల తొలగింపునకు రంగం సిద్ధం చేసింది. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో ఆర్జిత సేవలను రద్దు చేసి, పరోక్ష సేవగా అందించాలని, అంతరాలయ దర్శనాలను పూర్తిగా నిలిపివేయాలని దేవదాయ శాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు. సామాన్య భక్తులకు రూ.500 టికెట్ విక్రయాలను నిలిపివేసి, ప్రముఖులు, సిఫార్సు ఉన్న వారికి మాత్రమే బంగారు వాకిలి దర్శనం కల్పించాలనే ఆలోచన చేస్తున్నారు. వీటిపై దేవదాయ శాఖ మంత్రితో బుధవారం జరిగే సమీక్ష సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దసరా ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేకంగా లక్ష కుంకుమార్చన, ప్రత్యేక చండీహోమం నిర్వహిస్తారు. దసరా పది రోజుల్లో ప్రత్యేక కుంకుమార్చన, చండీహోమం టికెట్లను రూ.3 వేలుగా నిర్ణయిస్తారు. మూలా నక్షత్రం రోజు ప్రత్యేక కుంకుమార్చన టికెట్ ధర రూ.5 వేలు ఉంటుంది. రెండేళ్లగా మహామండపం ఆరో అంతస్తులో ప్రత్యేక ఖడ్గమాలార్చన సేవను సైతం ఉభయదాతలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సేవలకు భక్తుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. అటువంటి ఆర్జిత సేవలను రద్దు చేసేందుకు దేవదాయ శాఖకు చెందిన ముఖ్య అధికారి పావులు కదుపుతున్నారు. ఒక వేళ ఆర్జిత సేవలు రద్దుకు మంత్రి ఆమోదం తెలపని పక్షంలో పరోక్ష సేవలుగా భక్తులకు అందించేందుకు దేవదాయ శాఖకు చెందిన కీలక అధికారులు దుర్గగుడి అధికారులకు సూచన చేశారు.

రూ. కోటికి పైగా ఆదాయం

దసరా ఉత్సవాల పది రోజుల పాటు నిర్వహించే ఈ ప్రత్యేక ఆర్జిత సేవల ద్వారా దేవస్థానానికి రూ.కోటికి పైగా ఆదాయం సమకూరుతుంది. రోజు రెండు షిఫ్టుల్లో ప్రత్యేక కుంకుమార్చనలో సుమారు 300 మందికి పైగా ఉభయదాతలు, వంద మందికి పైగా ప్రత్యేక చండీహోమం సేవల్లో పాల్గొంటారు. మూలా నక్షత్రం రోజు టికెటు ధర రూ.5 వేలు అయినా దొరకడమే కష్టం. ఈ సేవలను నిలిపివేస్తే రూ.కోటి ఆదాయం కోల్పోవాల్సి వస్తుందని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. దేవదాయ శాఖ చేస్తున్న ఆలోచనను ఆలయ అర్చకులు, వైదిక కమిటీ బాధ్యులు వ్యతిరేకిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తుల మనోభావాలతో ఆటలు ఆడవద్దని సూచన చేస్తున్నారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో దసరా ఉత్సవాల సమీక్ష సమావేశం బుధవారం జరగనుంది. ఈ సమీక్ష సమావేశంలో ఆర్జిత సేవల అంశమే ప్రధాన అజెండా అనుందని సమాచారం.

హైకోర్టులో పోస్టుల భర్తీ పరీక్షలకు సర్వం సిద్ధం

గుంటూరు లీగల్: ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు హైకోర్టులో ఉద్యోగాల భర్తీకి నిర్వహించనున్న పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణ చక్రవర్తి మంగళవారం వెల్లడించారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందు ఆయా కేంద్రాల గేట్లు మూసివేస్తారన్నారు. ఆ తర్వాత అభ్యర్థులను అనుమతించబోరని చెప్పారు. నిర్ణీత సమయంలో అభ్యర్థులు రావాలని సూచించారు. హాల్ టికెట్, గుర్తింపు కార్డు తప్పక తీసుకురావాలని తెలిపారు. ఏ కారణంతోనైనా అభ్యర్థి గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీని తీసుకొస్తే, టీసీఎస్ నుంచి ఇన్‌చార్జి, పరిశీలకుడిగా నామినేట్ చేయబడిన జ్యుడీషియల్ ఆఫీసర్ హాజరు షీట్‌లో అభ్యర్థులకు తుది ధ్రువీకరణకు లోబడి తాత్కాలికంగా అనుమతి ఇస్తున్నట్లు వెల్లడించారు. హాల్ టిక్కెట్లను డౌన్లోడ్ చేసుకోవడంలో సాంకేతిక సమస్యలు ఎదురైతే హెల్ప్ డెస్క్ 0863 - 2372752, మెయిల్ ఐడీ helpdesk-hc.ap.@aij లో సంప్రదించాలన్నారు.

బాలుడి మృతిపై అనుమానాలు

తల్లి ఫిర్యాదు మేరకు మరణించిన రెండు మాసాల అనంతరం పోస్టుమార్టం



పోస్టుమార్టం ప్రక్రియను పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

క్రోసూరు: మండలంలోని విప్పర్ల గ్రామంలోని ఎస్సీకాలనీ (గోవిందపురం)కు చెందిన బాలుడు రెండు మాసాల క్రితం మృతి చెందగా, బాలుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి తల్లి పోలీసుస్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన జరిగింది. ఎస్ఐ రవిబాబు తెలిపిన వివరాల మేరకు.. జూన్ నెల రెండవ తేదీన విప్పర్ల గ్రామానికి చెందిన ఎర్రగుండ్ల జోష్ణప్రకాశ్ (8) బావిలో పడి మృతి చెందాడు. అప్పుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడనుకుని ఖననం చేశారు. పది రోజుల క్రితం మృతుడి తల్లి శ్రావణి తన కుమారుడిని చంపి బావిలో వేసారన్న అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని క్రోసూరు సీఐ రమేష్, ట్రైనీ ఎస్ఐ గోపిల పర్యవేక్షణలో గుంటూరు నుంచి వచ్చిన ఇద్దరు ఫోరెన్సిక్ వైద్యులు, తహసీల్దార్ వి.వి.నాగరాజు, వీఆర్వోల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు.

కేంద్ర మాజీ మంత్రి సతీమణి కన్నుమూత



నాగేశ్వరమ్మ (ఫైల్)

దుగ్గిరాల: రాజ్యసభ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన దివంగత వెనిగళ్ల సత్యనారాయణ సతీమణి నాగేశ్వరమ్మ(94) సోమవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆమె భౌతికకాయాన్ని మంగళవారం ప్రజల సందర్శనార్థం దుగ్గిరాలలోని స్వగృహంలో ఉంచారు. ఆమెకు కుమారుడు, ఆరుగురు కుమార్తెలు. నాగేశ్వరమ్మ అంత్యక్రియలు మంగళవారం దుగ్గిరాల హిందూ శ్మశాన వాటికలో ముగిశాయి. మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి, పలువురు నాయకులు, మండల అధికారులు, సర్పంచ్‌లు ఆమెకు నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.